## క్లుప్తంగా

### మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



మంత్రి ఆదిమూలపు సురేష్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ అబ్దుల్ గఫార్ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు విన్నమించారు. మంగళవారం ఒంగోలులో చైర్మన్ గఫార్ మంత్రిని కలిసినట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించినపాతబిల్లులు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రిని ఘనంగా సన్మానించారు.

### ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆద్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధవరావు మాట్లాడుతూ 2019 ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని, పీఆర్సీ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని డిమాండ్‌చేశారు. డిపో చైర్మన్ కె.శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎం కోటయ్య, సెక్రటరీ కేవీఆర్ రెడ్డి, గ్యారేజీ అధ్యక్షుడు జి.గంగాధర్, కార్యదర్శి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

### అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి: గ్రామాల్లో ఎవరైన అపరిచత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని పీసీపల్లి నూతన ఎస్సై కోటయ్య ప్రజలను కోరారు. గుడ్ ఈవెనింగ్ టు ఆల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వాకంవారిపల్లి గ్రామాల్లో ఎస్సై కోటయ్య ప్రజలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైన అపరచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రోడ్డు మధ్యలో ఏదైన ప్రమాదం సంభవిస్తే 100 కు తెలపాలన్నారు.

### స్కిల్ హబ్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె. ఉషారాణి తెలిపారు. ఈ స్కిల్ హబ్ శిక్షణ శిబిరాన్ని పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ వరకు విద్యార్హత కల్గిన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15వ తేది లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కనిగిరి స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ ఆర్. బెనర్జీ బాబు 8008611618 , 8008822821 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

టంగుటూరు: మండలంలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 27 మంది పేద విద్యార్థుకు ముప్పవరపు మురళి, ఇద్దరు విద్యార్థులకు గుర్రం లక్ష్మీనారాయణ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. అలాగే టంగుటూరు ఆర్య వైశ్య సంఘం వారు పెన్నులు, ప్యాడ్లు బహూకరించారు. కార్యక్రమంలో కొత్తూరు రవికుమార్, చంద్రశేఖర్ గుప్తా, కొత్తూరి రత్నకుమారి, ప్రధానోపాధ్యాయుడు తులసిప్రభ, పీడీ అరుణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



పూజలో పాల్గొన్న మాలధారులు

టంగుటూరు: స్థానిక ట్రంకు రోడ్డులోని ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయం(బాబు గుడి)లో కార్తీక మాసం ముగింపు సందర్భంగా అయ్యప్ప పడి, అంబుల పూజ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకం, చందనాభిషేకం, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మాలధారులు భక్తి శ్రద్దలతో భజనలు చేశారు. అనంతరం అయ్యప్ప దీక్షదారులకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు బక్కమంతుల నాగేశ్వరరావు, పొందూరి రమణారెడ్డి, అబ్బూరి వరప్రసాద్, మక్కెన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శోభికా



వలేటివారిపాలెంలో కిట్లు అందజేస్తున్న అధికారులు

కందుకూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రకు ఆటల పోటీలను విజయవంతంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ శోభికా అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు, పీడీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రకు కార్యక్రమాన్ని ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో ఉండే క్రీడా మైదానాలు ఆటలు ఆడేందుకు అనుకూలంగా ఉన్నాయో లేదో ఫొటోలు చూపించాలని అధికారులను కోరారు. ఆటల పోటీలు ప్రారంభించే నాటికి క్రీడా మైదానాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నియమించిన అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీఓ పి.విజయశేఖర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ అనసూయ, అధికారులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడలకు ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ భారతి, తహశీల్దార్ సుందరమ్మ, ఎంఈఓ మల్లికార్జున్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు పాల్గొన్నారు.

ఉలవపాడు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ శోభిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత తీసుకుని ఆటస్థలాలను బాగు చేయించాలన్నారు. ఎంపీడీఓ ఎల్ చెంచమ్మ మాట్లాడుతూ మండల పరిధిలో క్రికెట్‌కు 36 టీమ్‌లు, వాలీబాల్‌కు 26 టీంలు, కబడ్డీ 22 టీంలు, బ్యాడ్మింటన్ 43, ఖోఖో 20 టీంలు వచ్చినట్లు తెలిపారు. ఎంపీపీ మస్తానమ్మ, తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంఈఓ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఆడుదాం ఆంధ్రకు 2712 మంది**

పామూరు: మండలంలోని ఈనెల 15 నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు మండలంలోని మంగళవారం సాయంత్రానికి 2712 మంది తమపేర్లను నమోదు చేసుకున్నట్లు ఎంపీడీవో ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాట్‌మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మార్కొండాపురం, లక్ష్మీనరసాపురం, బొట్లగూడూరు, కంబాలదిన్నెతోపాటు పలు పాఠశాలల్లోని క్రీడామైదానాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**2307 మంది**

సీఎస్‌పురం (పామూరు): మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించే క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాట్‌మింటన్ పోటీలకు మంగళవారం వరకు 2307 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు ఈవోపీఆర్‌ఆర్‌డీ కె.సుందరరామయ్య తెలిపారు. 15 సంవత్సరాల వయస్సు పైబడినవారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

**ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి**

పొన్నలూరు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయా సచివాలయాలకు ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, ఎస్‌కే చిన్నమస్తాన్, మెండా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మార్కొండాపురంలో క్రీడలకు సిద్ధం చేస్తున్న గ్రౌండ్



సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్‌లో క్రీడలకు ముస్తాబవుతున్న క్రీడాప్రాంగణం



పొన్నలూరులో క్రీడా వస్తువులు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



చెన్నిపాడులో పథకాల లబ్ధిని వివరిస్తున్న నాయకులు



రావూరులో సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

గుడ్లూరు: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావూరులో గ్రామ సచివాలయం వద్ద అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రదర్శనా బోర్డును ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కొర్నిపాటి బాపిరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ముందుగా దివంగత మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండానుఆ విష్కరించారు. సర్పంచ్ గంగమ్మ, జేసీఎస్ కన్వీనర్ గాజుల కిషోర్, జిల్లా కార్యదర్శి బిల్లా రమణయ్య, నాయకులు సుబ్బరామయ్య, సుధాకర్, రామారావు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉలవపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలిచిన నాయకుడు అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నంపోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావుఅన్నారు. మండల పరిధిలోని ఆత్మకూరులో వైఏపీనీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా, సచివాలయ కన్వీనర్లు వెంకటరామిరెడ్డి, నిరూప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని పోలినేనిపాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర అన్నారు. మండలంలోని పోలినేనిపాలెం సచివాలయంలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం సర్పంచ్ అనుమోలు అమరేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ భారతి, నాయకులు అనుమోలు సుబ్బరావు పాల్గొన్నారు.

**వై ఏపీ నీడ్స్ జగన్**

పొన్నలూరు: పొన్నలూరు మండలంలో చెన్నిపాడు సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చెన్నిపాడు సచివాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.17 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, ఈఓఆర్డీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సంగమేశ్వరం బోర్డు ట్రస్ట్ చైర్మన్ బూచిరాజు మాల్యాద్రి, సర్పంచ్ గుత్తి శారమ్మ, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, గుత్తి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణలో పాల్గొన్న మహిళలు

కందుకూరు: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో పంటలు సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జి.ప్రసాద్‌బాబు అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఏపీ సీఎస్ఎఫ్ ఆద్వర్యంలో లింగసముద్రం మండలంలోని ఆర్ఆర్ పాలెంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర పంట యాజమాన్య పద్దతులైన లోతుదుక్కులు, పచ్చిరొట్ట పైర్ల పెంపకం, నేల సారవంతం అగుటకు పేడ ఎరువు, వానపాముల ఎరువు, పొలంలో గొర్రెలను నిలపడం, బీజామృతంతో విత్తనశుద్ధి, జీవశిలీంద్రనాశనులు వినియోగం, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు వంటివి కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాలకొండయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం నాటు ఆవుపేడ, మూత్రం ద్వారానే ఘనజీవామృతం, పంచగవ్య లాంటి పోషకాలు తయారు చేసుకోవచ్చునని సూచించారు. డీఆర్‌డీఏ ఏపీఎం సింహాద్రి, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది యంటి సునీత, మాధవ, రాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బాలినేనికి జన్మదిన శుభాకాంక్షలు










మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఒంగోలులోని ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య

## ఉపాధి పనులపై గ్రామ సభ

హనుమంతునిపాడు: గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల పై సామాజిక తనిఖీ టీంలు మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో ఈ ఏడాది 44.65 లక్షలతో జరిగిన పనులపై చర్చించారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, ఎఫ్ఏ ఉన్నారు.


## వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



మస్తానమ్మకు నగదు అందజేస్తున్న సర్పంచి హరిబాబు

జరుగుమల్లి: మండల పరిధిలోని చింతలపాలెం గ్రామంలో కోసూరి మస్తానమ్మకు డాక్టర్ వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును సర్పంచి వేల్పుల హరిబాబు మంగళవారం అందజేశబూరు. గ్రామానికి చెందిన కోసూరి కోటేశ్వరరావు(46 ) పక్షవాతంతోబాధపడుతూ సోమవారం మృతి చెందారు. దీంతో ఆయన నామినీ అయిన మస్తానమ్మకు నగదు అందించారు. మిగిలిన నగదును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. సచివాలయ కార్యదర్శి కిషోర్, వెల్ఫేర్ అసిస్టెంట్ త్రివిక్రమ్, వలంటీర్లు పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాల భైరవస్వామి

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంటలో ప్రసిద్ధిగాంచిన కాలభైరవస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కూష్మాండ దీపారాధనను అర్చకులు మురళీకృష్ణ శర్మ, శ్రీనివాసరావు నిర్వహించారు. కాలభైరవ శాంతి హోమం, పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాధాలు పంపిణీ చేశారు. సింగరాయకొండలోని పాండురంగ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదాతలుగా భాస్కరరెడ్డి, సునీత దంపతులు వ్యవహరించారు.

## ముమ్మరంగా ఇ- క్రాప్ సర్వే

హనుమంతునిపాడు: మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగున్న పంటలు ఇ- క్రాప్ నమోదు సర్వేను వ్యవసాయ శాఖ సహాయకులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు మినుము, అలసంద, కంది, మిరప, వరి సాగు మంటలను పొలం మీదకు వెళ్లి మంగళవారం పంటలను పరిశీలించి రైతుతో ఇ- క్రాప్ మోదు చేస్తున్నారు. మంగళవారం సీతారాంపురం, వాలిచర్ల, కూటాగుండ్ల, దొడ్డిచింతల, హాజీపురం, కొండారెడ్డిపల్లి, వేములపాడు, నందనదనవనం తదితర గ్రామాల్లో వీఏఏలు పంటలను పరిశీలించి ఇ-క్రాప్ నమోదు చేశారు. ఇ- క్రాప్‌కు రైతు పట్టాదార్ పాస్ పుస్తం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లతో పాటు ఫోన్ నంబర్ ఇవ్వాలన్నారు. రబ్బాని, ఆంద్రా కాశయ్య, ఏడు కొండలు రైతులు పాల్గొన్నారు.



మంత్రి సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

# మంత్రి సురేష్‌ను కలిసిన మద్దిపూడి నాయకులు

మద్దిపూడి: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగాగా ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మద్దిపూడి మండలంలోని పలువురు నాయకులు ఒంగోలు పాత జిల్లా పరిషత్ కార్యాలయంలో మంత్రి ఆదిమూలపు సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మద్దిపూడి, చిమట సొసైటీ అధ్యక్షుడు బోగస ముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, సర్పంచ్ కె.భాస్కర్, కోఆప్షన్ సభ్యులు కొండ్రు ఇజ్రాయిల్, ఎస్సీ నాయకులు కొండ్రు సాల్మన్, నారప నాయుడు, రమణయ్య, శ్రీను, నారపరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



గుడ్లూరులో సమీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ మారుతీరావు

గుడ్లూరు: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలకు మంగళవారం వైద్యాధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ వారితో కలిసి పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. 16 గ్రామ సచివాలయాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయడానికి సైఫానోత్రిన్ ద్రావణం పంపిణీ చేశామన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిస్తూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించాలన్నారు. అలాగే 5 ఏళ్ల లోపు చిన్న పిల్లల్లో శ్వాసకోస వ్యాధులను గుర్తించి సర్వే నిర్వహించి వారి వివరాలను వైద్యశాలలో అందచేయాలన్నారు. దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న చిన్నారులను గుర్తించాలన్నారు. సీహెచ్‌ఓ భాస్కరరావు పాల్గొన్నారు.

# తాళ్లూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు

కనిగిరి రూరల్: మండలంలోని తాళ్లూరు పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం జరిగింది. తొలుత మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన మంత్రి విడియో సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జున రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ 17 రకాల పథకాలు, వాటి లబ్ధి గూర్చి వివరించారు. సర్పంచ్ పోలా మంగతాయారు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధికారులు పి. జోత్స్నదేవి, ఈఓపీఆర్‌డీ ఓ. అన్నమ్మ, కార్యదర్శి అంకమ్మరాజు, వైద్యాధికారి స్వప్న, ఏపీఎం జీవరత్నం, అంగన్‌వాడీ సూపర్ వైజర్ ధనలక్ష్మి, ఫకద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీఎస్, వీఓఏలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రావూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్య నారాయణ సింగ్

గుడ్లూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పులి రమేష్, తహసీల్దార్ సూర్యనారాయణసింగ్ అన్నారు. మండలంలోని రావూరు, సాలిపేట గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్, హెల్త్‌కార్డులు, ఉజ్వల యోజన, స్కిల్ ఇండియా, పీఎం జనధన యోజన తదితర పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి, ఏపీఎం అశోక్, సర్పంచ్‌లు చాపల రమణయ్య, గంగమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## శబరిమలకు ప్రత్యేక బస్సులు

కందుకూరు: శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం పెద్దన్నశెట్టి మంగళవారం తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో, జనవరి 1,4,6,8 తేదీల్లో శబరిమలకు ప్రత్యేక బస్సులు వెళ్తాయన్నారు. నాలుగు రోజుల యాత్రకి ఒక్క ప్రయాణికుడికి టికెట్ కింద రూ.4,200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 15 మంది అయ్యప్పస్వాములు ఉంటే బస్సు నేరుగా వారి గ్రామానికే పంపిస్తామని, పూర్తి వివరాలకు 7382889870 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: క్షేత్ర స్థాయిలో ఎనర్జీ అసిస్టెంట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు.